ప్రజాశక్తి

బుధవారం 25 సెప్టెంబరు 2024

5

శ్రీకాకుళం



నేటి నుంచి చెకుముకి సంబరాలు

టెక్కలి : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన బుధవారం నుంచి చెకుముకి సంబరాలు జిల్లాస్థాయిలో నిర్వహించనున్నామని వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సంబరాల్లో భాగంగా బుధవారం పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నామని అన్నారు. 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు కావాలని కోరారు. అక్టోబరు 1న మండలాస్థాయి, అక్టోబరు 27న జిల్లాస్థాయిలో, నవంబరు రెండో వారంలో రాష్ట్రస్థాయిలో ఈ ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే విజ్ఞానంతో పాటు తార్కిక ఆలోచన, శాస్త్రీయ దృక్పథం పెంపొందింపజేసేందుకు ఈ పోటీ పరీక్షలు అవసరమని అన్నారు. ఆయా పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఈ సంబరాలు నిర్వహించనున్నామని తెలిపారు.

భారీ వర్షాలపై అప్రమత్తం

- మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు
- అధికారుల సెలవులు రద్దు
- జిల్లా కేంద్రంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడడంతో జిల్లావ్యాప్తంగా బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులతో మంగళవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలోని నదులు, వాగుల్లో ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

కాజ్ వే, వంతెనలపై నీరు ప్రవహించే చోట్ల పాదచారులు, వాహన చోదకులను నియంత్రించాలని ఆదేశించారు. తీర ప్రాంత మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గండ్లు పడే అవకాశమున్న చెరువులు, కరకట్టలు, కాలువలపై నిఘా ఉంచి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద ముంపునకు గురయ్యే అవకాశమున్న గ్రామాలను గుర్తించి అవసరం మేరకు వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు పనిచేస్తున్న కేంద్రాలను విడిచి ఎవరూ వెళ్లరాదని, అధికారులకు సెలవులను రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో 08942 240557 ఫోన్ నంబరుతో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలు అత్యవసర సమయంలో ఫోన్ చేస్తే వెంటనే అప్రమత్తమై తగు సహాయం చేస్తామని చెప్పారు.

నామినేటెడ్‌లో నామమాత్రమే

- జిల్లాకు ప్రాధాన్యం లేని కార్పొరేషన్లను కట్టబెట్టిన వైనం
- ఎపిటిపిసి చైర్మన్‌గా వజ్జ బాబూరావు
- మార్క్‌ఫెడ్ సభ్యునిగా ఆనెపు రామకృష్ణ
- అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యునిగా సీర రమణయ్య

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస, బూర్జ

నామినేటెడ్ పదవుల భర్తీపై ఊరిస్తూ వచ్చిన ప్రభుత్వం ఎట్టకేలకు పలు కార్పొరేషన్లకు చైర్మన్లు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 20 కార్పొరేషన్లకు చైర్మన్లు, వాటికి సంబంధించిన సభ్యులను నియమించింది. ఇందులో జిల్లాకు సంబంధించి రాష్ట్రస్థాయి హోదాలో ఒక చైర్మన్ పదవితో పాటు రెండు కార్పొరేషన్లకు ఇద్దరు సభ్యులకు అవకాశం కల్పించింది. జిల్లాకు ఇచ్చిన మూడు నామినేటెడ్ పదవులూ టిడిపికి చెందిన వారికే దక్కాయి. కూటమి భాగస్వామ్యపక్షాలైన జనసేన, బిజెపికి తొలి విడతలో అవకాశం దక్కలేదు. తమకు ఏదో ఒక పదవి వస్తుందని ఆశలు పెట్టుకున్న వారు జాబితా చూసి తీవ్ర నిరాశకు లోనయ్యారు.

బాబూరావుకు ఎపిటిపిసి చైర్మన్ పదవి

ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు సంబంధించి టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావుకు ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిటిపిసి) చైర్మన్‌గా నియమించింది. 1994లో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావుపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టెక్కలి నియోజకవర్గం నుంచి పోటీ చేసి రాజకీయ అరంగేట్రం చేశారు. 2002లో పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ ప్రథమ చైర్మన్‌గా ఆయన వ్యవహరించారు. 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో పలాస నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేశారు. 2017 నుంచి టిడిపిలో చేరి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడు విజయానికి విశేషంగా కృషి చేశారు. పార్టీ విధేయునిగా ఉన్న ఆయనకు చైర్మన్ పదవి వరించడంతో టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలాసలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాబూరావును ఎమ్మెల్యే గౌతు శిరీష సత్కరించారు. తనకు చైర్మన్ పదవి రావడానికి కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



బాబూరావు



రామకృష్ణ



రమణయ్య

బాబూరావుకు పదవిపై టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్, ఎల్.కామేశ్వరరావు, తమ్మినేని గంగారాం, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్ తదితరులు అభినందనలు తెలిపారు.

రెండు కార్పొరేషన్లలో ఇద్దరికి చోటు

ఆమదాలవలస నియోజకవర్గం బూర్జ మండలానికి చెందిన ఎపి పంచాయతీరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణను మార్క్‌ఫెడ్ సభ్యునిగా నియమితులయ్యారు. 2017లో ఆయన టిడిపిలో చేరారు. పంచాయతీలకు నిధులు, సర్పంచ్‌లకు అధికారాలపై రాష్ట్రవ్యాప్తంగా పోరాడి పార్టీ దృష్టిని ఆకర్షించారు. దీంతో ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం మార్క్‌ఫెడ్ సభ్యునిగా అవకాశం కల్పించింది. ఆయనకు నామినేటెడ్ పదవి దక్కడంపై ఆ నియోజకవర్గ టిడిపి నాయకులు అభినందనలు తెలిపారు. టిడిపి శ్రీకాకుళం రూరల్ మండల అధ్యక్షులు సీర రమణయ్యకు ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యునిగా ప్రభుత్వం అవకాశం కల్పించింది.

జూన్‌కు పోర్టులో మొదటి షిప్ ల్యాండ్

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - నౌపడ

వచ్చే ఏడాది జూన్ 12వ తేదీ నాటికి మూలపేట పోర్టులో మొదటి షిప్ ల్యాండ్ కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సంతబొమ్మాళి మండలంలోని మూలపేట, విష్ణుచక్రం గ్రామస్తులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. నిర్వాసితులు మంత్రికి పలు సమస్యలను విన్నవించారు. గతంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ఆర్మీ ఉద్యోగులకు పూర్తిస్థాయి పరిహారం ఇప్పిస్తామని చెప్పి సంతకాలు తీసుకున్నారని, నిబంధనలు పేరు చెప్పి సగం సొమ్ము మాత్రమే చెల్లించారని పలువురు ఆర్మీ ఉద్యోగులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయం గత ప్రభుత్వం ఉద్యోగులకు చెప్పలేదని, అయితే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో ఉన్న నిబంధనలు మేరకే పరిహారం అందిస్తామని మంత్రి చెప్పారు. తనకు 11 ఎకరాలు ఉంటే కేవలం రెండు ఎకరాలే రికార్డుల్లో చూపిస్తున్నారని గ్రామానికి చెందిన నారంనాయుడు వాపోయారు. దీనిపై మంత్రి స్పందిస్తూ నష్టపరిహారంపై అధికారులతో క్రాస్ చెక్ చేయించి గ్రామసభలో వినిపిస్తామని హామీనిచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పోర్టు కోసం ఇచ్చిన 350 ఎకరాల పంట పొలాల రీ సర్వే కోసం కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలలో జీడి, మామిడి చెట్లకు గతంలో కొంతమందికి పోర్టు యాజమాన్యం చెల్లింపులు చేసిందని, మిగతా వారి వివరాలనూ సేకరించి వారితోనే పరిహారం చెల్లిస్తామని చెప్పారు. మిగిలిన 41 ఎకరాలు వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. ఇప్పటివరకు పరిహారం అందుకోని నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం తక్షణమే అందజేస్తామన్నారు. అనంతరం విజయవాడ వరద బాధితులకు డిసిసిబి ఉద్యోగులు సిఎం సహాయనిధికి ఒక్కరోజు వేతనం విరాళంగా రూ.5,02,846 చెక్కును మంత్రికి అందజేశారు. సమావేశంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, ఆర్‌డిఒ సుదర్శన్ దొర, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, రెవెన్యూ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి చెక్కును అందజేస్తున్న డిసిసిబి ఉద్యోగులు

రక్తదానానికి ముందుకు రావాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి జెసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత అవసరాల రీత్యా యువత అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని స్పష్టం చేశారు. కళాశాలకు చెందిన వంద మంది అమ్మాయిలు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం, యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కాకినాడ ఆదిత్య కళాశాల డైరెక్టర్ బి.ఎస్ చక్రవర్తి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్, కళాశాల అధినేత ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.ఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

కుటుంబ అవసరాలపై ఇంటింటా సర్వే

- సర్వే పత్రం రూపొందించిన డిఆర్‌డిఎ
- గ్రామీణ ప్రాంతాల్లో విఒఎలు వివరాల సేకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కుటుంబాల అవసరాలపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) సర్వే చేయాలని నిర్ణయించింది. వివరాల సేకరణ కోసం క్షేత్రస్థాయి సిబ్బందికి బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే ఇందుకు సంబంధించి రూపొందించిన సర్వే పత్రాలను వారికి అందించింది. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న విఒఎలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని ఆదేశించింది. కుటుంబంలో సభ్యుల సంఖ్య, సామాజిక తరగతి, కుటుంబ పెద్ద వృత్తి వంటి వ్యక్తిగత అంశాలను సేకరించనున్నారు. దీంతోపాటు ఆ కుటుంబానికి ఏమేం కావాలో తెలుసుకోవాలంటూ పురమాయించింది. రేషన్‌కార్డు, పెన్షన్లు, అభయహస్తం పెన్షన్లు, తాగునీరు, విద్యుత్ సర్వీసు, ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్, ఉద్యోగం, ఇళ్లు, ఇళ్ల రిపేర్లు, ఉపాధి జాబ్‌కార్డు వంటి అంశాలను సేకరించనున్నారు. వీటితోపాటు పట్టు పెంపకం, ఉద్యాన పంటల సాగు, రైతుభరోసా, పిఎం కిసాన్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్ల ద్వారా రుణాలు, ఆదరణ, చంద్రన్న బీమా, ఎస్‌హెచ్‌జిలో సభ్యులుగా ఉన్నారా? జీవనభృతి ఏమైనా కోరుకుంటున్నారా వంటి 34 అంశాలపై వివరాలను సేకరించనున్నారు. జిల్లాలో డిఆర్‌డిఎ అందిస్తున్న పథకాల అమలు, గ్రామీణ ప్రాంత ప్రజల స్థితిగతులను తెలుసుకునేందుకే జిల్లాలో సర్వే చేపడుతున్నామని డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు.

కొత్తమ్మతల్లి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

అక్టోబరు ఒకటి నుంచి మూడో తేదీ వరకు నిర్వహించనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సామాన్య యాత్రికులకు సులభతర దర్శనం, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాట్లు, బందోబస్తును ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ ఏర్పాట్లలో లోపాలు కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గాలిగోపురం మరమ్మతులు, ఆలయానికి రంగులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఉత్సవాలకు ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా నుంచీ అత్యధిక సంఖ్యలో యాత్రికులు రానున్న నేపథ్యంలో దర్శనానికి ఎటువంటి ఆటంకాల్లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బారికేడ్లు, క్యూలైన్ల ఏర్పాట్లు సక్రమంగా ఉండాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ పాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాలను అనుసంధానం చేసి ప్రత్యేక పోలీస్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలకు అవసరమైన సిబ్బందిని కేటాయించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గడ్డెమ్మ, ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు, ఎంపిడి కె.ఫణీంద్ర కుమార్, తహశీల్దార్ అప్పలరాజు, సిఐ శ్రీనివాస్, ఆలయ ఇఒ రాధాకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రంగయ్య

స్కానింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్కానింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య అధికారులను ఆదేశించారు. లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ (పిసిపిఎన్‌డిటి) చట్టం అమలుపై జిల్లాస్థాయి సబ్ కమిటీ సమావేశాన్ని స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ ఛాంబరులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కోసం వచ్చే ప్రతిఒక్కరి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. లింగ నిష్పత్తిపై కళాశాల స్థాయిలో విద్యార్థులకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, అలా చేసే వారికి చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాలు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి బహిర్గతం చేస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశ అనంతరం నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల వండాన హాస్పిటల్‌లో పిసిపిఎన్‌డిటి నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో ఎడిఎంహెచ్ఒ శ్రీకాంత్, కిరణ్ కుమార్, స్వీప్ సంస్థ ప్రతినిధి కె.రమణమూర్తి, స్వచ్ఛంద సేవకులు మంత్రి వెంకటస్వామి, జిజిహెచ్ వైద్యులు విద్యాసాగర్, గైనకాలజిస్ట్ స్వర్ణలత. రేడియాలజిస్ట్ రాజేష్ కుమార్ ప్రదాన, ఎస్ఐ కె.పైడపునాయుడు, పిసిపిఎన్‌డిటి ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ

- నిజానిజాలు నిగ్గు తేల్చాలి
- మాజీ స్పీకర్ తమ్మినేని డిమాండ్

ప్రజాశక్తి - ఆమదాలవలస

తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగిస్తున్నారన్న ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని మాజీ స్పీకర్, వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతానికి పైగా హిందువులున్నారని, వారి మనోభావాలను దెబ్బతీసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతారహితంగా మాట్లాడడం తగదన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను ఉన్నతస్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. ప్రసాదం కోసం వాడే పదార్థాల్లో నాణ్యత విషయంలో లోపభూయిష్టంగా ఉన్నట్లు అధికారులు గుర్తిస్తే, సదరు కాంట్రాక్టు సంస్థలను బ్లాక్‌లిస్టులో పెట్టేవారని చెప్పారు. టిటిడి ప్రయోగశాలలో నిర్వహించిన పరీక్షల్లో నాణ్యత సరిగా లేని నెయ్యి ట్యాంకర్లను 14 సార్లు చంద్రబాబు హయాంలో వెనక్కి పంపిస్తే, జగన్ పాలనలో 18 సార్లు వెనక్కి పంపించారని తెలిపారు. జంతువుల కొవ్వు కలిపిన నెయ్యితో తయారు చేసే లడ్డూలు గానీ ఇతర ఆహార పదార్థాలు గానీ దుర్వాసన వస్తుందని ఆహార పరిశోధకులు స్పష్టం చేశారన్నారు. సాధారణంగా కల్తీ చేయాలనుకునే వ్యాపార సంస్థలు పామాయిల్, హైడ్రోజనేటెడ్ కూరగాయల కొవ్వు కలుపుతారని... దీనివల్ల తక్కువ వ్యయంతో ఎక్కువ లాభార్జనకు అవకాశముంటుందన్నారు. లడ్డూ తయారీకి మెటీరియల్ ఎవరు సరఫరా చేసినా నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్ సర్టిపై చేయాల్సి ఉంటుందని తెలిపారు. వైసిపి పాలనలో లడ్డూ కోసం వాడిన ప్రతి పదార్థాన్నీ ఈ లేబొరేటరీ నిర్ధారణ చేసిందన్నారు. టిటిడి విశిష్టతను నలుదిక్కులా చాటి చెప్పాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయాల కోసం నిస్సిగ్గుగా వాడుకోవడం బాధాకరమన్నారు. సమావేశంలో కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల రామారావు, బూర్జ ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, వైసిపి నాయకులు ఖండాపు గోవిందరావు గుమ్మడి రాంబాబు, బగాది నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం



పరిశీలిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

పాతపట్నం సబ్ జైలు పరిశీలన

ప్రజాశక్తి - పాతపట్నం

మండలంలోని సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మంగళవారం పరిశీలించారు. జైల్లో ఉన్న ఖైదీలతో మాట్లాడి భోజన సదుపాయాలు, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు పడుకునే గదులు, జైలు పరిసరాలను పరిశీలించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి ఎం.రోషిణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సత్యనారాయణ, సబ్ జైలు విజిటింగ్ లాయర్ జి.రామ్మోహనరావు, జైలు సూపరింటెండెంట్ జి.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - గార

వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులు అందిపుచ్చుకోవడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని శాలిహుండంలో సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు, సమగ్ర ఎరువుల యజమాన్యం, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలసాయం అందించేలా రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, శాస్త్రవేత్తలు పొలం బాట పట్టి రైతులతో మమేకమై సాంకేతిక సేవలందించాలన్నారు. సాగు ఖర్చులు తగ్గించి నాణ్యమైన దిగుబడి పెంపే లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. రైతులకు ఉన్న సందేహాలు నివృత్తి చేయాలని, సలహాలు, సూచనలు అందించాలన్నారు. అనంతరం పొలం పొలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జెడి శ్రీధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్



కూలిన నారాయణ బట్టి కల్వర్టు

ప్రజాశక్తి - కంచిలి

మండల కేంద్రం నుంచి అంపురం మీదుగా ఘాటి ముకుందపురం వెళ్లే రహదారిలో గల నారాయణ బట్టి కల్వర్టు మంగళవారం ఆకస్మాత్తుగా కూలింది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించిన ప్రయాణికులు భయాందోళనలు వక్తం చేసేవారు. ఈ రహదారితో పాటు కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులకు నోచుకోలేదు. మంగళవారం ఉదయం కల్వర్టు పైభాగంలో పగుళ్ల ఏర్పడడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై రాకపోకలు స్వచ్ఛందంగా నిలిపివేశారు. సమాచారాన్ని ఆర్అండ్‌బి అధికారులకు ఇవ్వడంతో కేసరిపడ మీదుగా రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కూలిన కల్వర్టును ఎమ్మెల్యే బెందాళం అశోక్ అధికారులతో కలిసి పరిశీలించారు. రూ.4.99 లక్షలతో తాత్కాలిక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే శాశ్వత పనులకు చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట ఆర్అండ్‌బి డిఇ రామినాయుడు, ఎఇఇ మోహనరావు తదితరులున్నారు.



పోలాకి : వాలీబాల్ సర్వీస్ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్, (గ్రిడ్) పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు మానసికోల్లాసం, శారీరకంగా ధృఢత్వం పెరుగుతుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా సమాజం గుర్తిస్తుందన్నారు.

సందడిగా క్రీడా పోటీలు

టెక్కలి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు సందడిగా సాగాయి. లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, వంటి క్రీడలు నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజయం సాధించిన జట్టు క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నియోజకవర్గ కన్వీనర్ బాడాన నారాయణరావు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన వివిధ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, సి.హెచ్.వాసుదేవరావు, పి.తిరుపతిరావు, వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, కె.కె.రామిరెడ్డి, కప్పిలి ప్రకాష్, నాగళ్ల రమేష్, ఆదిశేషు, లక్ష్మణరావు, వెంకటరమణ, రతీసోనా, జగ్గయ్య, యాగాటి శ్రీనాథరావు, జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

శ్రీకాకుళం అర్బన్: స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్‌లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు అన్నారు. పర్యాటక శాఖ, నగరపాలక సంస్థ, ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల సంయుక్తంగా స్వచ్ఛతా హీ సేవ, ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు మంగళవారం హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పదేళ్ల కిందటే స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రవేశపెట్టిందని తద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కలిగించిందన్నారు. ఇంటితో పాటు పరిసరాలూ పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి, లెక్చరర్లు కె.అప్పారావు, బి.అప్పారావు, ఇంటాక్ పూర్వ కన్వీనర్ డాక్టర్ రాధాప్రసాద్, మైనారిటీ వెల్ఫేర్ అధికారి డి.రమేష్, మహిబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

పొందూరు: పొందూరు మండలం కింతలిలో సర్వే నంబరు 48-17ఎలోని ప్రభుత్వ భూమిలో ఆక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని తొలగించాలంటూ మంగళవారం మాజీ సర్పంచ్ దవల గణపతిరావు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సువ్వారి నర్సింహులు, సువ్వారి అప్పలనాయుడులు ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఇక్కడ చేపడుతున్న నిర్మాణంపై అప్పటి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో దానిని పరిశీలించి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలంటూ ఆక్రమణదారులకు ఆదేశించారు. మరలా నిర్మాణం చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని తెలిపారు. కానీ, అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ మరలా నిర్మాణ పనులు జరుపుతున్నారని అన్నారు. అక్రమంగా నిర్మాణం చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు ఆ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని అధికారులను కోరుతూ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

వంద రోజుల ప్రగతిపై ప్రచారం



సరుబుజ్జిలి : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సంక్షోభం నుంచి సంక్షేమం వైపు అడుగులు వేస్తూ రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని చిన్నకాగితాపల్లి, సింధువాడ పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా కాకితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. అలాగే కొత్తూరు వ్యవసాయశాఖ ఎడి బి.రాజగోపాలరావు ఆధ్వర్యాన నిర్వహించిన పొలం పిలుస్తుందిలోనూ పాల్గొన్నారు. కాగితాపల్లి సచివాలయం వద్ద బూర్జ ఐసిడిఎస్ సిడిపిఒ గీత, సూపర్‌వైజర్ రత్నాంజలి ఆధ్వర్యాన నిర్వహించిన పౌష్టికాహార మసోత్సవంలో పాల్గొని గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కాగితాపల్లి, శాస్త్రులపేట, ఎల్.కె.పల్లి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. వీరభద్రపురంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి పార్టీ పరిశీలకులు ఎస్.చంద్రశేఖర్ కూటమి నాయకులు పేడాడ రామ్మోహన్, తహశీల్దార్ మధుసూదన్, ఎంపిడిఒ పి.వి.పి.మురళీమోహన్ కుమార్ పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ పూజారి వీధిలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అలాగే వచ్చే వేసవిలో ప్రజల తాగునీరు కష్టాలు తీర్చడానికి ఇప్పటి నుంచే తగు ప్రణాళికతో అధికారులు ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యాన గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ త్యాడి, కోట్ని దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, డిఇఇ కనకరాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గంగమ్మ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రాపాక పంచాయతీ వావిలపల్లిపేటలో ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కండాపు శ్రీనివాసరావు, పైడి రామారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రజా పాలన టిడిపితోనే సాధ్యమని మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీతాసాగర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 13వ వార్డులోని విద్యానగర్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పాలన పూర్తయిన సందర్భంగా మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్, కూన విజయ్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే 17వ వార్డు పూజారిపేటలో నిర్వహించిన



పలాస : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కార్యక్రమంలో టిడిపి నాయకులు బుడుమూరు గోవిందరావు, చిగురుపల్లి వెంకటేష్, బగాది భాస్కరరావు, పేడాడ కృష్ణ, పైడి ఆనందరావు, పైడి వసంత్, అన్నెపు రాము పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మర్రిపాడు-కె, మెళియాపుట్టి పంచాయతీల్లో టిడిపి కూటమి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనపై పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు ఎ.రాజశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు చాపర మాధవరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి, విఆర్‌ఒ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : టిడిపి కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని 17వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి జన్నెల సంతోష్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేశారు.

శ్రీకాకుళం రూరల్ : టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే రాష్ట్రం ప్రగతిపథంలో నడుతస్తుందని మాజీ ఎంపిపి గొండు జగపతి, టిడిపి శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షులు గొండు స్వాతిశంకర్ అన్నారు. మండలంలోని కృష్టప్పపేటలో ఇంటింటికీ వెళ్లి పోసర్లను పంపిణీ చేశారు.



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రైలు ఢీకొని యువకుడు మృతి

పాతపట్నం : మండలంలోని కాపుగోపాలపురానికి చెందిన రేగేటి రాజేష్ (28) పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో గుణుపూర్ రైలు ఢీకొని మంగళవారం మృతి చెందాడు. మృతుడు ఆత్మహత్య చేసుకున్నారా? రైలు ప్రమాదామా? అని తెలియరావాల్సి ఉంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది. మృతుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

వృద్ధురాలికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని చల్లవానిపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రేగులపాడుకు చెందిన కింజరాపు సుందరమ్మ అనే వృద్ధురాలి గాయపడింది. ఈనెల 18న ఆమె కన్నవారి గ్రామమైన నర్సింగపల్లి వెళ్లింది. తిరిగి బస్సుకోసం చల్లవానిపేటకు నడిచివస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఆమెను ఢీకొంది. వెంటనే స్థానికులు 108లో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి రాగోలు జెమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడి నుంచి కెజిహెచ్‌కు తరలించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిపై తనయుడు దాడి

నందిగాం : మండలంలోని కనితిఊరుకు చెందిన అన్నెపు విద్యానందం తనకు భూమిలో వాటా ఇవ్వడం లేదని తండ్రి మోహనరావును మంగళవారం గాయపరిచాడు. దీంతో కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై అత్యాచారయత్నం

కోటబొమ్మాళి: మండలంలోని నీలంపేట పంచాయతీ సోమనాథపురానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన వంజరాపు సన్యాసిరావు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మహిళ గ్రామ సమీపంలోని ఓ తోటలోకి బహిర్భూమికి వెళ్లిందన్నారు. తిరిగి బయటకు వస్తున్న సమయంలో సన్యాసిరావు ఆకస్మికంగా వచ్చి ఆమెను బలవంతం చేయబోయాడని అన్నారు. ఆమె పెనుగులాడడంతో గాజులు విరిగిపోవడంతో నైటీ చిరిగిపోయిందన్నారు. కేకలు విన్న ఆమె మరిది బొడ్డాపు సింహాచలం పరుగున వెళ్లి సన్యాసిరావుతో ఘర్షణ పడ్డారని అన్నారు. కాగా, తన కుమారుడైన వంజరాపు సన్యాసిరావుపై బొడ్డాపు గుర్రయ్య, అతని కుమారులు గోపాలరావు, సిమ్మయ్య, అతని కుమారుడైన గంగయ్య, బొడ్డాపు సింహాచలం, సురేష్, అప్పలరాజులు మంగళవారం సాయంత్రం దాడికి పాల్పడ్డారని సోమనాథపురానికి చెందిన వంజరాపు గడ్డెమ్మ మంగళవారం ఫిర్యాదు చేశారని అన్నారు. ఇరు గ్రూపుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

అధికారుల తీరుపై రైతుల ధ్వజం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో భూములు రీ సర్వేలో సర్వేయర్ గిరిరాజు, విఆర్‌ఒ రామారావు, ప్రత్యేక డిటి అనంతకుమార్‌లు అవకతవకలకు పాల్పడ్డారని రైతులు ధ్వజమెత్తారు. ఇటీవల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన, మీకోసంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కర్లెమ్మ సచివాలయం తహశీల్దార్ బడే పాపారావు ఆధ్వర్యాన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు అవకతవకలకు పాల్పడడంతో 1300 ఎకరాలు, 400 మంది రైతుల భూముల వివరాలు తారుమారయ్యాయని అన్నారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, పాత, కొత్త రికార్డులను పరిశీలించి పరిష్కరిస్తానని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్



మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

మాట్లాడుతూ పాత రికార్డుల ప్రకారం రైతుల సమస్యలు పరిష్కరించకుంటే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గ్రామసభలో సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, డిటి ఎన్.సత్యనారాయణ, మండల సర్వేయర్ రమణయ్య, ఆర్. లక్ష్మణరావు, విఆర్‌ఒ రాము తదితరులు పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యేను అరెస్టు చేయాలి



శ్రీకాకుళం అర్బన్ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘ నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామ కృషంరాజును తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల జెఎసి నాయకులు కళ్లేపల్లి రామ్‌గోపాల్, తైక్వాండో శ్రీను, డాక్టర్ కంఠ వేణు, గుజ్జల గురిమూర్తి డిమాండ్ చేశారు. అంబేద్కర్ అంబేద్కర్ ఫ్లెక్సీని చించి తొలగించడాన్ని తప్పుడు పడుతూ దళిత సంఘాల నాయకులు మంగళశారం ఆందోళన చేపట్టారు. నగరంలోని డే అండ్ నైట్ కూడలి నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రమణ, పెయ్యల చంటి, భూషణ్, శంకర్, పంకు మహేష్, మణి, శీరరాజేశ్వరి, నీలాపు హారతి పాల్గొన్నారు.

కొత్తూరు: పశ్చిమ గోదావరి జిల్లా కాల్ల మండలం ఏలూరుపాడులో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఫ్లెక్సీనిఉండి ఎమ్మెల్యే రఘురాం కృష్ణంరాజు తొలగించి అవమాపరిచాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు టి.తిరుపతి డిమాండ్ చేశారు. ఫెక్లీని తొలగించి పైశాచికానందం పొందిన ఘటనపై స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద దళితులు నిరసన తెలిపారు. ఈ మేరకు కృష్ణంరాజు ఫొటోను దహనం చేశారు. ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానపరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పడాల నాగభూషణం, కోశాధికారి బొడ్డేపల్లి రామకృష్ణ, సర్పంచ్ నాస బాలకృష్ణ, మాజీ సర్పంచ్లఉ గుడివాడ రామారావు, మురపాక శంకరరావు, కొర్ర రవి, రాజీవ్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి- పలాస

పలాస డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటిఐలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ సంయుక్త మంగళవారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేరకు నాలుగు ప్రయివేటు సంస్థల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 137 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, అందులో 48 మంది వివిధ కంపెనీల్లో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పైల జవహర్ తెలిపారు. జిల్లా ప్లేసెమెంట్ అధికారి వంశీకృష్ణ మాట్లాడుతూ గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉదోగాల కోసం నిరీక్షణ చేయాల్సి వచ్చేదని అన్నారు. కానీ, ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కంపెనీలే మన వద్దకు వచ్చి వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధంగా పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ అధికారి రవికుమార్, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ సోమేశ్వరరావు, తేజేశ్వరరావు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

వరద బాధితులకు ఆర్థికసాయం

కోటబొమ్మాళి: వరద బాధితులకు మండలంలోని పట్టుపురానికి చెందిన కొత్తకోట కృష్ణారావు, కొత్తకోట వెంకటరమణలు రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు మండలంలోని నిమ్మాడలోని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం చెక్కును అందజేశారు. అలాగే నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జిల్లాలోని పలువురు వచ్చి అర్జీలను అందజేశారు. అలాగే మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ సతీసమీతంగా మర్యాదపూర్వకంగా కలిశారు.



రోడ్డు పక్కకు ఒరిగిన బస్సు

తప్పిన ప్రమాదం

నౌపద : సంతబొమ్మాళి మండలం ఇజ్జవరం వద్ద మంగళవారం ఉదయం ఆర్‌టిసి బస్సుకు ప్రమాదం తప్పింది. టెక్కలి నుంచి నౌపడ, పూండి మీదుగా బస్సు పలాస వెళ్తుంది. ఇజ్జవరం దరి నౌపడ రైల్వే గేట్ సమీపంలోకి వచ్చేసరికి గొర్రెల మంద ఎదురు పడింది. గొర్రెలను తప్పించే క్రమంలో డ్రైవర్ రోడ్డుకు కుడి వైపు నుంచి బస్సును పోనించాడు. దీంతో అప్పటికే పైప్‌లైన్ వేసి కప్పేసిన మట్టిలో బస్సు టైర్ దిగబడి ఎదురుగా ఉన్న 33 కెవి విద్యుత్ లైన్ స్తంభం వరకు దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో విద్యుత్ స్తంభానికి ఢీకొనకుండా పక్కకు ఒరిగింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు అరుపులు, కేకలతో భయాందోళన చెందారు. ఎవరికి ఏ ప్రమాదమో జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ప్రయాణికులను ఇతర వాహనాల్లో తరలించి బస్సును పైకి తీశారు. రోడ్డుకు ఇరువైపులా ఇటీవలే వేసిన పైప్‌లైన్లపై మట్టి వర్షం కారణంగా కుమిలిపోతుందని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల ప్రతిభ



టెక్కలి: టెక్కలి ఎన్‌టిఆర్ క్రీడా వికాస్ కేంద్రానికి చెందిన ముగ్గురు విద్యార్థులు తైక్వాండ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని కోచ్ నర్సిపురం శేఖర్ తెలిపారు. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో తమ కేంద్రం నుంచి బాలికల 29 కిలోల విభాగంలో మెండ తపస్వి, బాలుర విభాగంలో ఎస్.మోహిత్, కూన ధరణీలు ఎంపికయ్యారని అన్నారు. అక్టోబరు నెలలో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొనున్నారని తెలిపారు. విజేతలకు డిఎస్‌డిఒ డాక్టర్ శ్రీధర్ అభినందించారు.

ఎన్‌సిసితో దేశభక్తి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఎన్‌సిసితో దేశభక్తి పెరుగుతుందని టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు అన్నారు. కళాశాలలో మొదటి ఏడాది విద్యార్థులకు ఎన్‌సిసి ఎంపికలను జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సిసిలో విద్యార్థులు ప్రవేశించడంతో చదువుతో పాటు వ్యక్తిగత క్రమశిక్షణ, శారీరక, మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత ఆత్మరక్షణ వృద్ధి చెందుతుందన్నారు. కళాశాల ప్రాంగణంలో సైతం క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఎన్‌సిసి ధ్రువపత్రాలు వల్ల ఉన్నత చదువుతో



జెండా ఊపి ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కలుగుతాయన్నారు. ఈ ఎన్‌సిసి ఎంపికలో 271 మంది విద్యార్థులు పాల్గొనగా, వీరిలో 35 మందికి ఎంపిక చేసి, ఏడుగురిని రిజర్వ్ ఉంచారన్నారు. శ్రీకాకుళం 14 బెటాలియన్ సుబేదార్ సి.రవికుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ఎల్ టి.మురళీమోహనరావు, హవల్దార్ జి.ఎస్.రెడ్డి, నాయక్ సుబేదార్, ఎన్‌సిసి ట్రైనర్ ఎన్.భుజంగరావు, పిడిలు ఎస్.లక్ష్మణమూర్తి, జె.తేజశ్వరి పాల్గొన్నారు.

బావుల్లో క్లోరినేషన్



బావిలో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘంలోని అన్ని నేల బావుల్లో మంగళవారం క్లోరినేషన్ చేయించారు. తాగునీటి వల్ల ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా?

ప్రజాశక్తి- పొందూరు

రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త నిల్వలు కనిపిస్తున్న ఈ చిత్రం పొందూరు మండలం తోలాపిలోని రామాలయం వీధిలోనిది. ఈ విధంగా వీధుల్లో చెత్తచెదారాలు ఉంటే రోగాలు ప్రబలే అవకాశం ఉందంటూ స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి చెత్తనిల్వలు కారణంగా దోమలు పెరిగి రోగాలు వ్యాప్తి చెంది జ్వరాలు బారిన పడే అవకాశం ఉందంటూ పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల గ్రామాలలో స్వచ్ఛతా హీ సేవా అంటూ పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాల ర్యాలీలు చేపడుతున్నారు. కానీ, ఇలా వీధుల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి అపారిశుధ్యం నెలకొంటుందని అన్నారు. వీధుల్లో చెత్తాచెదారాలు లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.



పేరుకుపోయిన చెత్తాచెదారాలు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

పోలాకి: మండలంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి మురళీధర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మన ప్రభుత్వం మన గౌరవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ కల్పన ద్వారా మంజూరైన ఇళ్లు వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ ఎఇ శంకరరావు మాట్లాడుతూ గృహ కల్పన ద్వారా 2,500 మంజూరు కాగా, ఇందులో 1500 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన వెయ్యి వివిధ దశల్లో నిర్మాణాలు పెండింగ్ ఉన్నాయని అన్నారు. ఈ నిర్మాణాలపై ఈ నెల 28న అన్ని గ్రామాల్లో అవగాహనా కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్ రావు, ఇఒపిఆర్‌డి పద్మావతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రధానమంత్రి యోజన పథకం కింద మంజూరైన ఇళ్లు మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, బిసి కార్పొరేషన్ ఎడి ఆర్.గడ్డెమ్మ ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అధ్యక్షతన సచివాలయ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, వెల్ఫర్ అధికారులతో సమీక్షించారు.

పొందూరు: మండలంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరి తగతిగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.నగేష్ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం మన ఇల్లు -మన గౌరవంపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, గృహనిర్మాణశాఖ డి.బాబూరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఎపిఎం శ్యామలరావు పాల్గొన్నారు.



పలాస : మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్ నాయుడు

పలాస : గత మూడున్నర క్రితం మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. గత ప్రభుత్వంలో 1549 గృహాలు మంజూరు కాగా, 822 గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. 240 గృహాలు వివిధ స్టేజ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. డిటి లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఎఇ వైకుంఠరావు పాల్గొన్నారు.

ఇసుక తరలింపు అడ్డగింత

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడ, పాతూరు, చేపేనపేట గ్రామాల సమీపంలో ఉన్న నాగావళి నది పరివాహక ప్రాంతంలో మంగళవారం హైడ్రామా చోటు చేసుకుంది. ఇటీవల ఈ మూడు గ్రామాల నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ఇసుక పోగులను రెవెన్యూ అధికారులు గుర్తించి గతంలో సీజ్ చేశారు. దీనిపై అప్పట్లో గ్రామస్తులు పలుమార్లు అధికారుల వద్దకు వెళ్లి వివరణ కోరినప్పటికీ సీజ్ చేసిన విషయం గనులు శాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ గృహ నిర్మాణాలకు వినియోగిస్తామని తెలిపినట్లు సమాచారం. మంగళవారం ఈ మేరకు రెవెన్యూ అధికారులు నాగావళి నది తీరంలోని మూడు గ్రామాల వద్ద ఉన్న ఇసుక పోగులను గనుల శాఖకు అప్పగించారు. సదరు ఇసుక పోగుల వద్ద నుంచి గనులశాఖ అధికారులు ఇసుకను తరలించి గృహ లబ్ధిదారులకు అందించడానికి ప్రొక్లెయినర్‌తో టిప్పర్లను తీసుకొని ఆ గ్రామాలకు



టిప్పర్‌ను అడ్డుకుంటున్న గ్రామస్తులు

చేరుకోగా మూడు గ్రామాలకు చెందిన కొంతమంది వ్యక్తులు ఇసుక తరలింపును అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు ఆ వ్యక్తులను ప్రశ్నించగా, మండలంలోని పలు గ్రామాల్లో నాగవళి నది తీరం అనుకొని ఎన్నో ఇసుక పోగులు వేసి ఉన్నాయని, వాటిని ముందు తరలించిన తర్వాతే తమ గ్రామాల నుంచి ఇసుక తీసుకువెళ్లాలని వాదనకు దిగారు. దీనితో అధికారులు చేసేదేమీ లేక ఇసుకను ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ గృహ నిర్మాణాలకు వినియోగించుకోవాలని గ్రామస్థాయి అధికారులకు అప్పగించి అక్కడనుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో పోలీస్ రెవెన్యూ, గనులశాఖ అధికారులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యాన్ని కాపాడేవి మందులే

నేడు ప్రపంచ ఫార్మాసిస్టు డే

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ప్రస్తుతం ఆరోగ్యం అంటే అందరికీ మోజు. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ నానాపాట్లు పడుతుంటారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో జనాలు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఏ చిన్నపాటి రాగమొచ్చినా వెంటనే మందులు తీసుకునేవారు. మన ఆరోగ్యంలో మందుల ప్రముఖ పాత్ర కీలకంగా పోషిస్తుంది. అలాంటి మందులు ఫార్మసిస్టు లే తయారు చేస్తారు. ఇంతకీ ఇదంతా ఇప్పుడు ఎందుకు చెబుతున్నామంటే బుధవారం ప్రపంచ ఫార్మసిస్ట్ డే. ఏటా సెప్టెంబరు 25న వరల్డ్ ఫారెన్సిస్ డే గా ఘనంగా జరుపుకుంటారు. ఫార్మసిస్టు మన ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎలాంటి పాత్ర పోషిస్తారో వైద్య ప్రపంచంలో ఫార్మసిస్టులు ప్రజలను అర్థం చేసుకునేందుకు ఎలాంటి కార్యకలాపాలు చేపడుతారో తెలుసుకోవాలంటే ఈ స్టోరీలోకి వెళ్లాల్సిందే. ప్రతిఒక్క ఫార్మసిస్టు ఇప్పుడు రెండో వైద్యుడుగా గుర్తించబడతాడు. అతను రోగులకు కావలసిన మందులను ఏ రోగికి ఎంత మోతాదులో మెడిసిన్ కావాలో నిర్ధారిస్తాడు. మందుల వల్ల దుష్ప్రభావాలు కలగకుండా మార్గనిర్దేశాలు చేస్తాడు. ప్రపంచంలోని ప్రతిఒక్క రోగికి అందరికీ సురక్షితమైన సమర్థవంతైన మందులు అందించేందుకు అనుక్షణం ఆరాటపడతారు. అందుకే ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం రోజున ఫార్మసిస్టులకు ప్రత్యేక రోజుగా నిలిచిపోతుంది. ఫార్మసిస్టులు కూడా సంప్రదాయంగా అచ్చం వైద్యుడిలాగే తెల్లటి కోటు ధరించి మందులు పంపిణీ చేసే ఆరోగ్య సంరక్షణ నిప్పుడిలా వారిని భావించవచ్చు. ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం అంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న అందరు ఫార్మసిస్టులకు వారి ప్రోత్సాహాలకు ప్రతిఒక్కరి జీవితంలో వారి ప్రతిభావంతమైన పాత్రకు ధన్యవాదాలు తెలుపుదాం.

ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



ఫార్మసీ విద్యార్థులకు అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ప్రతి ఒక్క విద్యార్థీ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి పర్చుకుని ఫార్మా రంగంలోని ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి. ఔషధ నిపుణులు, ఆరోగ్య సంరక్షణ నిపులపై రోగులకు అధిక నమ్మకం ఉన్నప్పుడు వారు చికిత్సకు బాగా స్పందిస్తారు. ఔషధాలు వాటి దుష్ప్రభావాలు చలన శీతల విషపూరితనం గురించి ఫార్మసిస్టులకు సమర్థవంతమైన జ్ఞానం ఉంటుంది. కోవిడ్ సమయంలో ఫార్మసీలు వ్యాక్సిన్ తయారు చేయడంతో పాటు కోల్డ్‌చైన్ నిర్వహణలో ప్రత్యేక పాత్ర పోషించి గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఫార్మసిస్టులను ప్రభుత్వం వైద్యాధికారుల గౌరవం అందిస్తుంది. ఆస్పత్రుల్లో కీ పోస్టుగా ఫార్మసిస్టులు ఉన్నారు.

- రేజేటి సుబ్రమణ్యం, ఫార్మాసిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

వైద్యరంగంలో కీలకపాత్ర



వైద్యరంగంలో ఫార్మసిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆరోగ్యంగా బతకడానికి మందుల రూపంగా, వ్యాక్సిన్ రూపంగా సృష్టికర్తలు బ్రహ్మలు ఫార్మసిస్టులే. కోవిడ్ మహమ్మారి నుంచి జనులను రక్షించేదీ ఫార్మసిస్టులే. నవజాతి శిశువులను వ్యాధి భారీ నుంచి తప్పించుకోవడానికి వారికి ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాక్సిన్ రూపంలో కనుగొన్నదీ ఫార్మసిస్టులే. వారికి సమాజం ఎప్పుడూ రుణపడి ఉంటుంది.

- డాక్టర్ నందిని, నౌపడ పిహెచ్‌సి వైద్యాధికారి



వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

రాజారాణి ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం రైల్వే స్టేషన్‌లో రాజారాణి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేసేందుకు కృషి చేయాలని టిడిపి మండల నాయకులు పైల బాబ్జీ కోరారు. ఈ మేరకు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతపట్నం నుంచి పలాస మీదుగా వెళ్లే పలు రైళ్లకు దూర తీర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు, వ్యాపారస్తులకు ఈ రైలు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు సైలాల సతీష్, షణ్ముఖరావు, బుజ్జి పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

అభివృద్ధి పనులపై విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా విజిలెన్స్ ఎస్‌పి బర్ల ప్రసాదరావు, డిఎస్‌పి ఎన్.కిరణ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఇఇ సుగుణాకర్, డిఇఇ సిహెచ్.సత్యనారాయణలు కలిసి మంగళవారం తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు మున్సిపాలిటీలో అంతరకడ్డ, పెసరపాడు, కిడ్నీ ఆస్పత్రి రహదారులతో పాటు కెటి రోడ్డు పనులు జరిగాయి. ఇందులో అనేక అవకతవకలు జరిగాయని, నాణ్యత లోపించిందనే ఫిర్యాదుపై అధికారుల బృందం తనిఖీలు చేపట్టారు. నిబంధనల మేరకు రోడ్డు తవ్వి అందులో ఎంత తారు కలిపారు అనేది పరిశీలించారు.

ఎమ్మెల్యేను కలిసిన విజిలెన్స్ ఎస్‌పి

ప్రజాశక్తి- పలాస



పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు విజిలెన్స్ ఎస్‌పి బర్ల ప్రసాదరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమెకు పూలమొక్క ఇచ్చి అభినందించారు. అలాగే రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావును మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ప్రసాదరావు జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఎస్ఐ, సిఐ, డిఎస్‌పిగా పనిచేశారు. ప్రస్తుతం విజిలెన్స ఎస్‌పిగా ఇటీవల బాధ్యతలను స్వీకరించారు.

బారువ రైల్వేస్టేషన్ యూజర్స్ కమిటీ ఎన్నిక

సోంపేట : స్థానిక బారువ రైల్వే స్టేషన్ యూజర్స్ కమిటీ ఎన్నిక మంగళవారం చేపట్టారు. కమిటీ అధ్యక్షునిగా రామ్‌బుడ్డి గణపతి, ఉపాధ్యక్షులుగా వై.రజిని, బి.మోహనరావు, యు.బ్రహ్మానందం, ఎస్.భాస్కరరావు, డి.సత్యం, ప్రధాన కార్యదర్శిగా రత్నాల శ్రీనివాసరావు, కన్వీనర్‌గా మడ్డు కుమార్, సహకార కార్యదర్శులుగా డి.సోమశేఖర్, పి.శేషగిరి, పి.గున్నయ్య, సంయుక్త కార్యదర్శిలుగా బి.కృష్ణ, పాపారావు, బి.లింగరాజు, కోశాధికారిగా సంగారు లక్ష్మీనారాయణ, సహ కోసాధికారిగా ఎం.శంకరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు 21 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను, సలహా సంఘం సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యే బెందాల అశోక్‌తో పాటు మరో 13 మందిని ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యాన బారువా రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ప్రధాన కార్యదర్శి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పాతపట్నం : మండలంలోని కమలమ్మ కొట్టు కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువులను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. కొత్తూరు మండలం మాతల నుంచి జలుమూరు మండలం పెద్దదూగంకు ఏడు ఎద్దులను వాహనంలో తరలిస్తుండగా... తనిఖీ చేపట్టి పట్టుకున్నారు. పవువులను, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతికతతోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి- పోలాకి

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని తలసంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్, నియోజక జనసేన ఇన్‌చార్జి బలగ ప్రవీణ్‌కుమార్, ఎడిఎ రవీంద్ర, ఎఒ చిరంజీవి, భైరి భాస్కరరావు, పి.సూరిబాబు, భావన ప్రసాదరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని కోష్టలో పిసిని జగన్నాథం నాయుడు ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారుర. కార్యక్రమంలో డిడిఎ త్రినాథస్వామి, ఎడిఎ వడ్డాది శ్రీనివాసరావు, మండల ఎఒ డి.విజయ భాస్కరరావు, హెచ్‌ఒ అనుషా, సైంటిస్ట్ డాక్టర్ కిరణ్ కుమార్, తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, ఎంపిటిసి పిసిని ఆసిరినాయుడుపాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని మండల ఎఒ కిరణ్‌వాణి అన్నారు. మండలంలోని పొల్లాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ పెట్టుబడితో మెరుగైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలని కోరారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు జ్యోత్స్న, రైతులు శివప్రసాద్, పాపారావు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నందిగాం : పంట దిగుబడి పెంచుకోవడంతో పాటు గింజ నాణ్యతకు, చీడపీడల నివారణకు పటాస్



పోలాకి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

దోహదపడుతుందని మండల ఎఒ పి.శ్రీకాంత్ వర్మ అన్నారు. మండలంలోని పెద్ద తామరపల్లి, రతజనబొడ్డపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని, చీడపీడల నివారణ సస్యరక్షణపై చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ సహాయకులు నీలిమ, విఎఎలు రాజేష్, లోకేష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని మండల ఎఒ గురువెల్లి రంగారావు అన్నారు. మండలంలోని పోలవరం, లింగాలవలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని మేలైన సాగు పద్ధతులు పాటించే విధంగా అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి పెంచే విధంగా మెలికలు చెప్పారు. భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువులు వాడకం వాడాలన్నారు.

వరికి దోమపోటు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ముందుగానే తెలుసుకొని క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి చిన్నంనాయుడు, మెట్ట సుందరరావు ధర్మరాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని బొడ్డకాలి, కేదారిపురంలో



రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

మండల ఎఒ భార్గవి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, ఎంపిటిసి మెరుగు సూర్యనారాయణరెడ్డి, బచ్చు మోహనరావు, లండ వెంకటరావు, లండ కృష్ణారెడ్డి, మెరుగు నారాయణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో చిట్టివలసలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపి వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, మండల ఎఒ ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మర్రిపాడు-కె, పరశురాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధుబాబు, మండల ఎఒ దానకర్ణుడు డ్రోన్లతో మందు పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సలాన శరత్ కుమార్, జనసేన నాయకులు దుక్క బాలరాజు, వైస్ ఎంపిపి ఆదినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలో చంగుడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అలాగే ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పైల బాబ్జి, మండల అధికారులు, సైలాడ సతీష్, కూటమి నాయకులు కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస :మండలంలోని దూసిలో ఎఒ మెట్ట మోహనరావు ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు తమ్మినేని అలేఖ్య, టిడిపి నాయకులు తమ్మినేని అప్పలనాయుడు రైతులు పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని బూర్జ, మామిడివలస గ్రామాల్లో మండల ఎఒ శ్రీనివాసరావు ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ, ఎంపిటిసి పోలినాయుడు, విష్ణురాజా చౌదరి, వాసు, ప్రతాప్ చౌదరి, సర్పంచ్ ప్రతినిధి రామకృష్ణ, అభ్యుదయ రైతు వెంకటప్పల నాయుడు పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని పాత్రకొండ, కర్తలిపాలెం గ్రామాల్లో జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.వెంకటరావు ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఉష, కుమారి, నేహ, పాపారావు, సవరయ్య, విశ్వనాథం, షణ్ముఖరావు, గిరి పాల్గొన్నారు.

పొందూరు : మండలంలోని గోరింత, దల్లవలస గ్రామాల్లో మండల ఎఒ బెండి బాబ్జీ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులు గురుగుబెల్లి తేజేశ్వరరావు, బి.రవళి పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని లబ్బలో ఎఒ స్వర్ణలత, డివిజనల్ ఎటి సూర్యనారాయణ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి తులసి, విఎఎ సుధాకర్, షణ్ముఖ, లపరాజు, పి.రామ్మోహనరావు, కె.సత్యం, వహాలయ్య, సింహాచలం, గోవిందరావు, మోహిని పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన్ స్టాఫ్ సెంటర్ ఆధ్వర్యంలో 'ఆడపిల్లలను చదివిద్దాం - ఆడపిల్లలను రక్షిద్దాం' అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయాల్లో మహిళలను ఆదుకునేందుకు వన్ స్టాఫ్ సెంటర్ ప్రభుత్వం ప్రారంభించిదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సోషల్ కౌన్సిలర్ సువ్వారి ప్రియదర్శిని, ఎఎస్ఐ రేణుకకుమారి పాల్గొన్నారు.

పలాస : బాలికలు ఎవ్వరికీ భయపడాల్సిన అవసరం లేదని, ఆడపిల్ల అంటే ఆడపులిలా ఉండాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో), ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్), హెూప్ ఫర్ లైఫ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన మంగళవారం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ అంశాలతో పాటు బాలికలు ప్రస్తుత



నరసన్నపేట : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సిబ్బంది

సమాజంలో ఎలా మసలుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాట్స్ పూర్వ చైర్మన్ అప్పసాని శ్రీధర్, డాక్టర్ హిమజ, ఆశాజ్యోతి, సైకాలజిస్టులు డాక్టర్ సంగీత, డాక్టర్ దామోదర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మాజీ సైనికుల అభ్యున్నతికి తోడ్పాటునందించేందుకు కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ఆనందదాయకమని మాజీ సైనికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు ఐ.ఎం.రావు, బి.బారికి, యు.వెంకటరావు, బి.బాబూరావు, కె.దుర్యోధన, ఐ.తాతారావు, విజయకుమార్, భావన ఢిల్లేశ్వరరావు, భావన, పద్మనాభం పాల్గొన్నారు.

నందిగాం: ఆడపిల్లలని రక్షిద్దాం-చదవనిద్దాం అనే నినాదంతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, నందిగాంలో కేస్ వర్కర్ బి.కవిత వన్ స్టాఫ్ సెంటర్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. సమాజంలో ఆడపిల్లలను చదివించడం, వారి స్వీయ రక్షణకు విద్యార్థినులకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు, వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలకు, మహిళలకు ఎటువంటి కష్టం కలిగినా 100, 1098, 181,112 హెల్ప్ లైన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. బాలికలు ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. ఆపద సమయంలోని బాలికలకు, మహిళలకు ఆపన్నహస్తంగా వన్‌స్టాఫ్ సెంటర్లు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాంత్ పరామర్శ

కొత్తూరు : కొత్తూరులోని వైసిపి నాయకులు టొంపల గోపి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తూర్పు కాపు మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ మంగళవారం పరామర్శించారు. త్వరలగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈయన వెంట వైసిపి నాయకులు గోగుల వరప్రసాదరావు నాయుడు, పిన్నింటి రామారావు నాయుడు, ఎడ్ల గోవిందరావు పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి

మెళియాపుట్టి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి ఎల్.వి.మధుబాబు అన్నారు. స్థానిక ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన కలిగిందన్నారు. మన ఇంటితో పాటు మన పరిసరాలూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ హనుమంతరావు, ఎంపిడిఒ పడాల చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిస్వార్థ సేవే లక్ష్యంగా జాతీయ సేవా పథకం ముందుకు సాగుతోందని, విద్యార్థి దశలో సేవా దృక్పతాన్ని అలవర్చుకునేందుకు ఎన్ఎస్ఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, అధ్యాపకులు హరిత, పోలినాయుడు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర ఆధ్వర్యాన జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్ సాహును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆకెళ్ల రామారావు, సివిక్స్ అధ్యాపకులు శ్రీనివాసరావు, వినోద్ రాజు, గొండు శ్రీనివాసరావు, విజయ, సంగీత, బోటనీ విజయ్, గౌతమి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్వార్థం లేకుండా సేవ చేయడంతో సమాజం అభివృద్ధి చెందుతుందని టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన జాతీయ సేవా పథకం దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే సేవాభావంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛందంగా సేవడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, పిఒ ఎస్.వి.ప్రసాద్‌లు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను కొనియాడారు.

టెక్కలి : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నియంత్రించవచ్చునని జాతీయ టూరిస్టు అండ్ సైక్లిస్టు సంతోష్‌కుమార్ మిశ్రా ఆన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవగాహన కల్పించారు. టెక్కలి ఎస్ఐ వి.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ చట్టాలను అవగాహన చేసుకోవాలన్నారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ అధ్యక్షతన విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురుని అలరించాయి. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం పిఒలు వి.లూక్‌పాల్, డి.వాసుబాబు, కంది గోళ్ల పాల్గొన్నారు.

పలాస : విద్యార్థులు చదువుతోపాటు సేవాభావం అలవర్చుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అన్నారు. పలాస డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

సేవా పథకం దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఇంటర్మీడియట్, డిగ్రీ దశే కీలకమన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.మధు, వైస్ ప్రిన్సిపాల్ గణపతి, పి.వి.రమణ, ఎన్.శ్రీనివాస్ పట్నాయక్ పాల్గొన్నారు.